క్లుప్తంగా

'పరీక్షలు ఇష్టంతో రాయాలి'



రెంజల్(బోధన్): పదవ తరగతి వార్షిక పరీక్షలను భయంతో కాకుండా ఇష్టంతో ఎదుర్కొవాలని కందకుర్తి సర్పంచ్ మిర్జా ఖలీంబేగ్ విద్యార్థులకు సూచించారు. గ్రామంలోని హైస్కూల్‌లో మంగళవారం వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్‌తో పాటు ఎంఈవో గణేశ్‌రావ్, విద్యార్థులకు సూచనలు అందించారు. పాఠశాలలోని ఉర్దూ మీడియం విద్యార్థులకు సర్పంచ్ పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులను అందించారు.

చిరు ధాన్యాలతో ఆరోగ్యం

రెంజల్(బోధన్): చిరుధాన్యాలను ప్రతీ ఒక్కరు అలవాటు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీలారాణీ, కిసాన్‌తండా సర్పంచ్ రాథోడ్ జమున అన్నారు. చిరుధాన్యాల్లో విటమిన్‌లు, ఐరన్, ఖనిజాలు, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయని వివరించారు. కిసాన్‌తండాలో మంగళవారం చిరుధాన్యాలతో దంపతులకు వంటల పోటీలను నిర్వహించి బహుమతులిచ్చారు.

బాధ్యతల స్వీకరణ

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పంచాయతీరాజ్ కార్యనిర్వాహక ఇంజినీర్ డివిజన్ కార్యాలయ ఈఈగా ఆర్.శంకర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఈఈగా విధులు నిర్వహించిన మురళి కామారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో బాన్సువాడ నుంచి శంకర్ ఆర్మూర్‌కు బదిలీపై వచ్చారు. కార్యాలయ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

ముగిసిన నామినేషన్లు

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని బార్ అసోసియేషన్(ఆర్మూర్) ఎన్నికల నామినేషన్ల పర్వం ముగిసిందని ఎన్నికల అధికారులు గటడి ఆనంద్, విజయలక్ష్మీలు మంగళవారం తెలిపారు. అధ్యక్ష పదవికి ముగ్గురు, గ్రంథాలయ కార్యదర్శి పదవికి ఇద్దరు నామినేషన్లు వేశారని ఎన్నికల అధికారులు పేర్కొన్నారు.

చెక్కుల పంపిణీ

బాల్కొండ: మండల పరిధిలో పలు గ్రామాలకు చెందిన 14 మంది లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను మంగళవారం మండల కేంద్రంలో పార్టీ కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంజూరుకు కృషి చేసిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

దివ్యాంగులకు బస్ పాసులు..

కమ్మర్‌పల్లి: మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మంగళవారం దివ్యాంగులకు బస్ పాస్‌లను పంపిణీ చేశారు. ఆర్టీసీ ఆధ్వర్యంలో మండలంలోని 46 మంది దివ్యాంగులకు బస్ పాస్‌లను ఎంపీపీ గౌతమి చేతుల మీదుగా అందజేశారు. ఆర్టీసీ అధికారి అహ్మద్ హుస్సేన్, ఏపీఎం కుంట గంగాధర్ పాల్గొన్నారు.

పిల్లలకు సైకిళ్లు..

బోధన్: స్థానిక ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ సతీమణి ఆయేషా ఫాతిమా తన ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ కేంద్రంలోని గోశాల రోడ్డులో గల మజీద్‌లో 46 మంది పిల్లలకు సైకిళ్లను పంపిణీ చేశారు. మజీద్ పెద్దలు, బీఆర్‌ఎస్ మైనార్టీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మోడల్ పేపర్లు..

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు ఆర్మూర్ పట్టణానికి చెందిన సామాజిక సేవకుడు పట్వారి తులసి కుమార్ మంగళవారం మోడల్ పేపర్లు అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం హరిత పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల కేంద్రంలో గల వాగు గడ్డ వీర హనుమాన్ ఆలయ ఐదవ వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హనుమాన్ మాలాధారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మాలాధారులకు అన్న ప్రసాదం చేశారు.

పశువుల సంతకు రూ.5 లక్షలు

రుద్రూర్: పోతంగల్ మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన పశువుల సంత వేలం పాటలో రూ.5 లక్షలకు గంధం గంగారాం దక్కించుకున్నారు. వారాతపు సంతకు వేలం పాట నిర్వహించగా జీపీ టార్గెట్ రాకపోవడంతో శనివారానికి వాయిదా వేసినట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి యాదవ్ తెలిపారు.

అటవీ శాఖ దినోత్సవం

బోధన్‌రూరల్(బోధన్): మండలంలోని జాడీ జమాల్‌పూర్‌లో ప్రపంచ అటవీ శాఖ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం గ్రామంలో జయశంకర్ తెలంగాణ కళాశాల పొలాస జగిత్యాల విద్యార్థుల బృందం ఆధ్వర్యంలో ఎంపీపీ బుద్దె సావిత్రి, సర్పంచ్ జ్యోతిలు సొసైటీ ఆవరణంలో మొక్కలు నాటారు. వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మన్ ఎండీ షకీల్ పాల్గొన్నారు.

శిథిలావస్థలో నిజాంసాగర్ కాలువలు



చెడిపోయిన షట్టర్లు



శిథిలావస్థకు చేరిన తూము

- విరిగిన షట్టర్లు..
- మరమ్మతులకు నోచుకోని వైనం

నందిపేట్(ఆర్మూర్): రైతులకు సాగునీరు అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం రూ.కోట్లు వెచ్చించి ప్రాజెక్టుల నిర్మాణం చేపడుతోంది. అదే ప్రభుత్వం పంట పొలాలకు నేరుగా సాగునీరు అందించేందుకు నిర్మించిన కాలువలు, తూములకు మరమ్మతులు చేయించడానికి నిధులు మంజూరు చేయడం లేదు. దీంతో తూములు, కల్వర్టులు, కాలువలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ప్రధాన కాలువల్లో పిచ్చి మొక్కలు పేరుకుపోయి నీటిని కిందకు వెళ్లకుండా అడ్డుపడుతున్నాయి. అంతే కాకుండా షట్టర్లు విరిగిపోవడం, మరికొన్నింటిని దొంగలు ఎత్తుకెళ్లడంతో నీరు వృథాగా పోయే ప్రమాదం ఏర్పడింది. మరికొన్ని చోట్ల కాలువలు తెగి ఇసుక మేటలు పెడుతున్నాయి. కాల్వ నిర్మాణం చేపట్టి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు చేపట్టకపోవడం ఆశ్చర్యకరం. ప్రధాన కాలువలే కాకుండా పంట పొలాలకు సాగునీరు అందించడానికి పిల్ల కాలువలు సైతం ఏర్పాటు చేశారు. అవి సైతం ఆనవాళ్లు కోల్పోయాయి. మరమ్మతుల కోసం ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతుందని రైతులు వాపోతున్నారు. నందిపేట మండల పరిధిలో డిస్ట్రిబ్యూటరీ కెనాల్ 19 కిలోమీటర్ల పొడవున ఉంటుంది. దీనికి 11 సబ్ డిస్ట్రిబ్యూటరీలు ఉన్నాయి. నాలుగింటికి మాత్రమే షట్టర్లు ఉన్నాయి. ఈ ప్రధాన కాలువ ద్వారా నందిపేట, మాక్లూర్ మండలాల్లోని సుమారు 26 గ్రామాలకు సాగునీరు అందించాలి. కాని ప్రతి ఏడు నందిపేట మండలంలోని ఆంధ్రనగర్, వెల్మల్, అయిలాపూర్, కంఠం గ్రామాలకు మాత్రమే నీరు చేరుతుంది.

కాగితాలకే పరిమితమైన ప్రతిపాదనలు

నిజాంసాగర్ ప్రధాన కాలువలు, పిల్లతూములు, తూములు, షట్టర్ల మరమ్మతులు కాగితాలకే పరిమితమయ్యాయి. ప్రధాన కాలువతో పాటు 82 డిస్ట్రిబ్యూటరీ కాలువల జంగల్ కటింగ్, తూముల మరమ్మతులు, ఇసుక మేటల తొలగింపునకు రూ.2 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపారు. ఇప్పటికీ అవి కాగితాలకే పరిమితం అయ్యాయి తప్ప కాలువల పరిస్థితి మెరుగు పడ్డ దాఖలాలు లేవు.

రీసర్వే చేయించాలి



నిజాంసాగర్ ప్రధాన కాలువతో పాటు డిస్ట్రిబ్యూటరీలు, తూములు, షట్టర్లు, కాలువ కట్టలకు పడ్డ గండ్లు, లీకేజీల కోసం ఇరిగేషన్ అధికారులు విడతల వారీగా నిధులు మంజూరు చేసి పనులు చేపట్టాలి. మరమ్మతులు చేయకపోవడం వల్ల కింది గ్రామాలకు ప్రజలకు నీరందటం లేదు.

–బండి నర్సాగౌడ్, రైతు, బజార్ కొత్తూర్

మరమ్మతులు త్వరగా చేపట్టాలి



నిజాంసాగర్ కాలువలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి. కాల్వలకు సీసీ లైనింగ్ పనులతో పాటు లీకేజీలను సరి చేయాలి. చివరి ఆయకట్టు వరకు నీరందించాలి. నీటి సరఫరా చేసేందుకు నియమించిన గ్యాంగ్‌మెన్ల విధులు సక్రమంగా నిర్వహించేటట్లు చర్యలు తీసుకుని విడతల వారీగా అన్ని గ్రామాలకు నీరందించాలి.

– ఊషన్న, రైతు, నందిపేట

సేవా సమితి డివిజన్ కన్వీనర్‌గా శివప్రసాద్



బోధన్: అఖిల భారత హనుమాన్ దీక్ష సేవా సమితి పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజి ఆదేశాల మేరకు ఆ సేవా సమితి జిల్లా గురుస్వామి హనుమద్దాసులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేముల నాగభూషణం సమక్షంలో, రాష్ట్ర ప్రచార కార్యదర్శి అంబలిపూర్ రాజు ఆధ్వర్యంలో డివిజన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. హనుమాన్ దీక్ష సేవా సమితి డివిజన్ కన్వీనర్‌గా కందారే శివప్రసాద్, కో–కన్వీనర్లుగా కందిమల్ శంకర్, పత్తి సురేష్ గురుస్వామి, మారా నాగభూషణం గురుస్వామి, సలహాదారులుగా అబ్బులు, సభ్యులుగా రత్నాకర్‌రెడ్డి, డీజే శ్రవణ్ గురుస్వామి తదితరులను ఎన్నుకున్నారు. ఈ విషయాన్ని సేవా సమితి నూతన కన్వీనర్ మంగళవారం తెలిపారు. హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడుతామని పేర్కొన్నారు.

ఆర్టీసీ బస్సులో ప్రయాణం క్షేమం

అర్మూర్‌టౌన్: ఆర్టీసీ బస్సులో ప్రయాణించడం క్షేమమని ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత అన్నారు. అర్మూర్ మున్సిపల్ పరిధిలోని మామిడిపల్లి చౌరస్తా వద్ద ఎంవీఐ వెంకటస్వామి, డిపో మేనేజర్ కవిత ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. లైసెన్స్‌లు లేని, ఆర్‌సీ బుక్ సరిగా లేని వాహనాలకు జరిమాన విధించారు. ప్రతి రోజు ప్రజలు ఆర్టీసీ బస్సులో ప్రయాణించి ఆర్టీసీని ఆదరించాలన్నారు.

ఇంటి వద్దకే తలంబ్రాల డెలివరీ

ఆర్మూర్‌టౌన్: భద్రాచలంలో జరగబోయే సీతారాముల కల్యాణం తలంబ్రాలను ఆర్టీసీ డిపో కార్గో ఆధ్వర్యంలో ఇంటి వద్దకే డెలివరీ చేస్తారని మున్సిపల్ చైర్‌పర్సన్ పండిత్ వినీత అన్నారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ పేరును తలంబ్రాల కోసం డిపో అధికారులు పేరు నమోదు చేసుకున్నారు. రూ.116 చెల్లిస్తే ఆర్టీసీ డిపో వారు ఇంటి వద్దకే వచ్చి అందజేస్తారని చైర్‌పర్సన్ చెప్పారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు పాలాభిషేకం

బాల్కొండ/మాక్లూర్: సెర్ప్ ఉద్యోగులకు పేస్కేల్ అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మెండోరా మండల కేంద్రంలో, మాక్లూర్ మండలం వెంకటాపూర్‌లలో మంగళవారం సీఎం కేసీఆర్, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చిత్ర పటాలకు సెర్ప్ ఉద్యోగులు పాలాభిషేకం నిర్వహించారు. కేసీఆర్ తమను గుర్తించి పే స్కేలు అమలు చేయటం ఆనందంగా ఉందన్నారు.



మెండోరాలో పాలాభిషేకం చేస్తున్న ఉద్యోగులు

రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఆగ్రహం



రుద్రూర్‌లో రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



వర్నిలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నేతలు

రుద్రూర్: మోస్రా, చందూర్, రుద్రూర్, పోతంగల్ మండల కేంద్రాల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మలను మంగళవారం బీఆర్‌ఎస్ నేతలు దహనం చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో కాంగ్రెస్ పాదయాత్ర సందర్భంగా స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆయన తనయులపై చేసిన ఆరోపణలపై బీఆర్‌ఎస్ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజకీయ లబ్ధి పొందాలనే దుర్బుద్ధితోనే నిరాధారణ ఆరోపణలు చేశారని మండి పడ్డారు.

అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు

వర్ని: అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని వర్ని మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షులు వెలగపూడి గోపాల్ హెచ్చరించారు. మండలంలోని జలాల్పూర్‌లో బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి వాస్తవాలు తెలుసుకొని మాట్లాడాలని ఆయన హితవు పలికారు. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు నిరసనగా వర్ని మండల కేంద్రంలో ఆయన దిష్టిబొమ్మను దహనం చేశారు. బీఆర్‌ఎస్ వర్ని మండల అధ్యక్షుడు కల్లాల్, గిరి జాకోర సహకార సంఘం అధ్యక్షులు కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'జిల్లా' దీక్షలు

బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట న్యాయవాదులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 93వ రోజుకు చేరాయి. దీక్షల్లో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు గంగారెడ్డి, న్యాయవాది నాయక్ సాయిలు కూర్చున్నారు. సీనియర్ న్యాయవాది సీహెచ్‌వీ హన్మంత్‌రావు దీక్షలను ప్రారంభించారు.

'డబుల్' బిల్లుల పంపిణీ

వర్ని: సేవాలాల్ తండాలో 20 మంది డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులకు ఐదో విడత బిల్లులను మార్కెట్ కమిటీ ఉపాధ్యక్షుడు వెలగపూడి గోపాల్ పంపిణీ చేశారు. మండల కో–ఆప్షన్ అబ్దుల్ కరీం, ఉప సర్పంచ్ కృష్ణ, సరిచంద్, బానోత్ పీర్యా నాయక్, మాలోత్ గంగారాం పాల్గొన్నారు.

మహిళ కానిస్టేబుల్‌ను కొట్టిన లెక్చరర్‌పై కేసు నమోదు

ఖలీల్వాడి: నగరంలోని ఎస్‌ఆర్ కాలేజీ వద్ద మహిళ కానిస్టేబుల్ను కొట్టిన లెక్చరర్ ఆఫ్రిన్ పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రావణ్ కుమార్ తెలిపారు. ఎస్‌ఆర్ కాలేజీ వద్ద ఇంటర్ పరీక్షలు జరుగుతున్నాయి. పరీక్ష పూర్తయిన తర్వాత పరీక్ష కేంద్రం గేటు వద్దకు లెక్చరర్ రావడంతో మహిళ కానిస్టేబుల్ అడ్డుకుంది. పరీక్ష కేంద్రం వద్దకు రావద్దని మహిళ కానిస్టేబుల్ చెప్పడంతో ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకున్నట్లు తెలిసింది. దీంతో మహిళ కానిస్టేబుల్ను లెక్చరర్ ఆఫ్రిన్ చెంప దెబ్బ కొట్టడంతో పోలీసు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. దీంతో పోలీసులు విచారణ జరిపి ఆఫ్రిన్ పై కేసు నమోదు చేశారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

బాల్కొండ: కిసాన్‌నగర్‌లో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బద్దం ప్రవీణ్‌రెడ్డి ప్రారంభించారు. గ్రామంలో రూ.15 లక్షల నిధులు సీసీ రోడ్ల నిర్మాణానికి మంజూరైనట్లు తెలిపారు. ఎంపీటీసీ రాంరాజ్‌గౌడ్, బీఆర్‌ఎస్ నాయకులు దాసరి వెంకటేశ్, లింగాగౌడ్, నాగభూషణం పాల్గొన్నారు.

మాందాపూర్‌లో..

మాక్లూర్: మాందాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లక్మాపూర్‌లో సీసీ రోడ్డు పనులను మంగళవారం సర్పంచ్ సులోచన ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ నుంచి రూ.10 లక్షల నిధులు మంజూ రయ్యాయి. ఉపసర్పంచ్ రాము, వార్డు సభ్యులు అల్లారి గంగయ్య, మల్లయ్య, అశోక్ పాల్గొన్నారు.

మొక్కలు నాటిన విద్యార్థులు

మాక్లూర్: అడవి మామిడిపల్లి శివారు చిన్నాపూర్ అర్బన్ పార్కులో మంగళవారం ఎంపీపీ మాస్త ప్రభాకర్ ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు విద్యార్థులతో మొక్కలు నాటించారు. భవిష్యత్తులో అర్బన్ పార్కును అన్నిరకాల చెట్లు ఉన్న పార్కుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా ఎంచుకున్నట్టు అటవీశాఖ అధికారులు ఈ సందర్భంగా వెల్లడించారు. సర్పంచ్ మల్లారెడ్డి, ఎంపీటీసీ సత్యనారాయణ ఉన్నారు.

తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలి

ఆర్మూర్‌టౌన్: ఎమ్మెల్సీ కవితపై నిరాధార ఆరోపణలు చేస్తున్న తీన్మార్ మల్లన్నపై చట్టరీత్యా చర్యలు తీసుకుని క్యూన్యూస్ ఛానెల్‌ను బ్యాన్ చేయాలని ఆర్మూర్ నియోజకవర్గ జాగృతి అధ్యక్షుడు మక్కల సాయినాథ్ డిమాండ్ చేశారు. ఆర్మూర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం తీన్మార్ మల్లన్నపై ఎస్‌హెచ్‌వో సురేష్‌బాబుకు ఫిర్యాదు చేశారు.

మోదీ విధానాలను వ్యతిరేకించండి

వర్ని: ప్రధాని నరేంద్ర మోదీ అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలు వ్యతిరేకించాలని వర్ని మండల కేంద్రంలో ఆర్టీసీ బస్సులో కరపత్రాలు పంచుతూ మంగళవారం సీపీఎం వర్ని ఏరియా కార్యదర్శి నన్నేసాబ్ ప్రచారం చేశారు. దేశంలో ప్రభుత్వ రంగ సంస్థలను అమ్ముతూ, ప్రైవేటీకరణను మోదీ ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. దేశభక్తి ముసుగులో విదేశీ జపం చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 24న జిల్లా కేంద్రంలో జన చైతన్య బహిరంగ సభ ఉంటుందని ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

కమ్మర్‌పల్లి: మండల మోటార్ వైండింగ్ మెకానిక్ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నవీన్, ఉపాధ్యక్షులుగా అశోక్, ఎంఏ మజీద్, ప్రధాన కార్యదర్శిగా దయాకర్, సహాయ కార్యదర్శిగా దుబ్బప్ప, కోశాధికారిగా సత్యపాల్‌లు ఎన్నికయ్యారు.

ఘనంగా ఉగాది వేడుకలు



ఆర్మూర్ టౌన్/బాల్కొండ/కమ్మర్‌పల్లి: జిల్లా వ్యాప్తంగా పలు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో మంగళవారం ఉగాది వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన ఉగాది పచ్చడిని ఉపాధ్యాయులకు, తోటి విద్యార్థులకు పంచిపెట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు ఉగాది విశిష్టత గురించి విద్యార్థులకు వివరించారు. ఉగాది సందర్భంగా ముప్కాల్ మండలంలోని నాగంపేట్ వేంకటేశ్వర ఆలయం ఉగాది ఉత్సవాలకు ముస్తాబైంది. ఆర్మూర్ పట్టణంలో ప్రజ్ఞ హైస్కూల్లో, కమ్మర్‌పల్లి మండల కేంద్రంలోని శ్రీవిద్యా సాయి హైస్కూల్లో ఉగాది వేడుకలు నిర్వహించారు.

అటెన్షన్ ప్లీజ్..

ఉన్నా.. లేనట్టే!

మున్సిపల్ కార్యాలయంలో పనుల కోసం వచ్చిన వారికి చల్లని నీరు అందించే వాటర్ ఫ్రిజ్ చెడిపోయి కొంతకాలంగా వృథాగా పడి ఉంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేసి చల్లని తాగునీరు అందించే సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. అసలే ఎండాకాలం కావడంతో పనుల నిమిత్తం వచ్చేవారికి చల్లటి నీటిని అందించే ఫ్రిజ్ చెడిపోవడం ఇబ్బందిగా మారింది.

– ఆర్మూర్‌టౌన్



ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో పనిచేయని వాటర్ ఫ్రిజ్

ప్రశ్నించాల్సిన అధికారి పేరు: ప్రసాద్ చౌహన్, మున్సిపల్ కమిషనర్, ఆర్మూర్

ఫోన్ నంబర్ : 98499 04276

విద్యార్థులు సేవాభావంతో మెలగాలి

మాక్లూర్: నర్సింగ్ కోర్సు విద్యార్థులు బాధ్యత కన్నా సేవాభావంతో మెలగాలని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని నర్సింగ్ కళాశాలలో 2022–23 మొదటి సంవత్సరం విద్యార్థులతో జరిగిన ప్రతిజ్ఞ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నర్సింగ్ కోర్సు పవిత్రమైందని, దీన్ని వరంగా భావించి సమాజంలో తమ వంతుగా సేవ చేయాలన్నారు. ఉద్యోగ బాధ్యతగా భావించకుండా సేవాభావంతోనే ముందుకు సాగాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొన్న జెడ్పీ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు, నర్సింగ్ విద్యార్థులనుద్దేశించి సుదీర్ఘ ఉపన్యాసం చేశారు. ఎంపీపీ మాస్త ప్రభాకర్, ఎంపీడీవో క్రాంతి, ఎంపీటీసీ వెంకటేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ ప్రతిమారాజ్

అంగన్‌వాడి సేవలను వినియోగించుకోవాలి

ఆర్మూర్‌టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడి కేంద్రాల ద్వారా గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడి టీచర్ అరుంధతి అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని రంగాచారినగర్ అంగన్‌వాడి కేంద్రంలో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆర్మూర్ ఆధ్వర్యంలో పోషణ అభియాన్, పోషణ పక్షోత్సవ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీల్లో పోషణ లోపం ఎక్కడా కనిపించకూడదని, పోషణ లోపం వల్ల పుట్టబోయే పిల్లల్లో అంగవైకల్యం ఏర్పడుతుందన్నారు. ప్రతి నెలా గర్భిణులు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, మందులు సకాలంలో వేసుకోవాలన్నారు.

పోషకాహారంపై అవగాహన అవసరం

రుద్రూర్: ప్రతి తల్లికి పోషకాహారంపై అవగాహన అవసరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మమత అన్నారు. మోస్రా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వంటల పోటీలు నిర్వహించి బహుమతులు అందచేశారు. చిరు ధాన్యాలలో ఉండే విటమిన్లు, ఐరన్ గురించి వివరించారు. తల్లులతో పోషణ ప్రతిజ్ఞ చేయించారు.



మోస్రాలో పోషణ ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీలు

కంటి వెలుగు శిబిరాలు ప్రారంభం

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం పిప్రిలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ఆసపురం దేవి, ఉప సర్పంచ్ ఆసపురం శ్రీనివాస్ రెడ్డి కోరారు. గ్రామంలో మంగళవారం కంటి వెలుగు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. సొసైటీ చైర్మన్ హేమంత్ రెడ్డి, ఎంపీటీసీ సురేష్, వైద్యాధికారిణి పూజా రెడ్డి పాల్గొన్నారు.

నెహ్రూనగర్‌లో..

బాల్కొండ: మెండోరా మండలం నెహ్రూనగర్‌లో కంటి వెలుగును ఎంపీపీ బురుకుల సుకన్య, సర్పంచ్ అనసూయతో కలిసి ప్రారంభించారు. ఎంపీటీసీ లక్ష్మీ, కోఆప్షన్ సభ్యుడు బాబా పాల్గొన్నారు.

అంకాపూర్‌లో..

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ మచ్చర్ల పూజిత కిశోర్ రెడ్డి ప్రారంభించారు. ఎంపీటీసీలు గంగా రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.

వెంకటాపూర్‌లో..

మాక్లూర్: మూడు రోజుల పాటు జరిగే కంటి వెలుగు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ దాదన్నగారి విఠల్‌రావు గ్రామస్తులకు సూచించారు. మంగళవారం వెంకటాపూర్‌లో కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఎంపీడీవో క్రాంతి, ఐకేపీ ఏపీఎం అనిల్ కుమార్, మండల వైద్యాధికారి సరిత పాల్గొన్నారు.



పిప్రిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ ఆసపురం దేవి శ్రీనివాస్ రెడ్డి

సమస్యలుంటే పరీక్షలు చేయించుకోవాలి

ఆర్మూర్‌టౌన్: కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రజలు పరీక్షలు చేయించుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేశ్ అన్నారు. ఆర్మూర్ పట్టణంలోని 34వ వార్డులో కంటి వెలుగు శిబిరాన్ని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా రీడింగ్ అద్దాలు ఇస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు 16 వార్డులలో కంటి శిబిరం పూర్తయిందన్నారు. మొత్తం 11 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు

రుద్రూర్: పోతంగల్ మండలం కారేగాం హైస్కూల్‌లో విద్యార్థులు చేసిన నృత్య, సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. మంగళవారం పాఠశాలలో పదవతరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జ్యోతి, పీఆర్‌టీయు అధ్యక్ష, కార్యదర్శులు గంగరాజు, కృష్ణ మోహన్, ఎస్‌ఎంసీ చైర్మెన్లు సాయిలు, ఉత్తమ్, హెడ్ మాస్టర్లు సూర్యకుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



సమాచారం..

నేడు కుస్తీపోటీలు

రెంజల్(బోధన్): ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని కల్యాపూర్, బోర్గాం గ్రామాల్లో బుధవారం వీడీసీల ఆధ్వర్యంలో కుస్తీపోటీలను నిర్వహించనున్నారు. కల్యాపూర్‌లో ఈ సంవత్సరం చివరి పోటీ విజేతకు 5 తులాల వెండి కడియం బహూకరిస్తున్నట్లు గ్రామ కమిటీ అధ్యక్షుడు గాండ్ల నాగరాజు తెలిపారు. మల్లయోధులు పోటీల్లో పాల్గొనాలన్నారు.